

# అనంతంమాస్టారు

-గరిమెళ్ళ నరసింహ శర్మ

"ఒరే, కాశీ!" అన్నారు శిఖిల మాస్టారు స్కూలు ప్యూను తెచ్చిన నోటీసు చదువుకొని.

కాశీ లేచి నిలబడ్డాడు.

"నువ్వు మూడు నెలల జీతం కట్ట లేదని నిన్ను క్లాసుకి రానియ్యద్దని హెడ్ మాస్టారుగారు నోటీసు పంపారు" అన్నారు. ఆయన కంఠంలో కొంత బాధ కూడా ధ్వనించింది తన అసహాయతకి.

మౌనంగా లేచి పుస్తకాలు తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు కాశీ. తిన్నగా వెళ్ళి హెడ్‌మాస్టారుగారి రూము దగ్గర నిలబడ్డాడు. కొత్త హెడ్‌మాస్టారుగారు కాగితాలు చూసుకుంటూ తల పైకెత్తారు. కాశీ లోపలికి వెళ్ళడానికి ప్రయత్నం చెయ్యనూ లేదు, ఆయన పిలవనూ లేదు.

ఓ గంట గడిచిపోయింది. స్కూలు ఆఖరి పీరియడుకూడా అయిపోయి అందరు వెళ్ళిపోయారు. కాశీ నిలబడే ఉన్నాడు. హెడ్‌మాస్టారుగారు వెళ్ళడానికి ఉద్యుక్తులవుతూ అన్నీ సర్దేశారు. దెల్లు కొట్టి ప్యూన్‌ని పిలిచి తలుపు వేసేయమని బయటికి వచ్చారు. కాశీ అక్కడే నిలబడి ఉన్నాడు. అనంతం మాస్టారు కొంచెం ఆశ్చర్యపోయారు.

"నమస్కారం, సార్!" మరి కళ్ళలో తిరిగిన కన్నీరు ఆపుకోలేకపోయాడు కాశీ.

"ఏం కావాలి, బాబూ?" ఎంతో ఆప్యాయంగా పలకరించారు అనంతం మాస్టారు.

"నా పేరు కాశీ విశ్వనాథం, సార్! ఈ స్కూల్లోనే థర్డ్ ఫారమ్ చదువు తున్నాను. మూడు నెలలబట్టి జీతం కట్టలేదని నన్ను మీరు క్లాసుకి రాని య్యొద్దని నోటీసు పంపారట. శిఖిల మాస్టారు చెప్పారు."

ప్యూను తాళాలు ఇచ్చి నమస్కారం చేశాడు. గొడుగు తాళాలు తీసుకుని, "నువ్వెళ్ళు" అన్నారు. "మంచిదయ్యా" అంటూ వెళ్ళిపోయాడు ప్యూను.

"మీ నాన్నగా రేం చేస్తుంటారు?" అని కాశీ వేపు తిరిగి అడిగారు అనంతం మాస్టారు.

"నాన్నగారు లేరు, సార్! మా అమ్మగారు మాత్రం ఉన్నారు. ఊరి చివర అయ్యారు హోటల్లో ఆవిడ పని చేస్తుం టారు. కాని, కిందటి నెలంతా ఆవిడకి ఒంట్లో బాగులేక పనికి వెళ్ళలేదు. అందుచేత వాళ్ళు జీతం ఇయ్యలేదు సార్!"

"అయితే, న న్నిప్పుడు ఏం చెయ్య మంటావు?"

"నన్ను క్లాసుకి రానీయండి, సార్! ఎలాగయినా అన్ని నెలల జీతాలు కట్టే స్తాను. నేను ట్యూషను చెబుతున్న వాళ్ళని ఈవేళ అడుగుతానండి. వాళ్ళిం తిస్తే అంతా మీకు కట్టేస్తాను, సార్! ఈ ఒక్కసారికి నా కీ సహాయం చేసి పెట్టండి" అన్నాడు కాశీ.

"నువ్వు ట్యూషన్లు చెబుతున్నావా?" కొంచెం ఆశ్చర్యంగానే అన్నారు అనంతం గారు. నడుస్తున్న వారల్లా ఆగిపోయి.

"అవును,సార్! మన తెలుగు మాస్టారు రాజుగారి పిల్లలకి చెబుతున్నానండి!" అన్నాడు వినయంగా.

"అలాగా! నువ్వు రేపోసారి నన్ను కలుసుకో."

"స్కూలుకి రావచ్చు నంటారా, సార్?"

"రా! నేను మీ క్లాసు టీచరుతో మాట్లాడతాను."

"నమస్కారం, సార్" అంటూ వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాలపాటు ఆయ నేం ఆలోచించలేకపోయారు. ఎందుకో ఆయన మనస్సు కలత పడిపోయింది. దారిలో మరెవరితోనో, "వీలుంటే రాజు మాస్టారుగారిని ఓసారి నన్ను కలవమను" అని కబురంపారు. అడుగులో అడుగేసు కుంటూ మెల్లగా ఇంటికి చేరారు. ఎదురుగా వచ్చిన పార్వతమ్మగారు గొడుగూ, తాళాలూ, కండువా తీసుకున్నారు. అలా పడకకుర్చీలో వాలి ఆలోచనల్లో కొరిగి పోయారు అనంతం మాస్టారు. కాని, ఆయనకి కాశీ రూపమే కళ్ళకి కట్టి నట్టుంది. వా డన్న మాటలే ఆయన చెవుల్లో రింగుమంటున్నాయి.

"నమస్కారం,మాస్టారూ!" అంటూ మాస్టారుగారు వచ్చారు.

"ఆ రండి, రండి" అంటూ పక్క నున్న కుర్చీ చూపించారు ఆలోచనల్లోంచి తేరుకున్న అనంతం మాస్టారు.


"ఎందుకో రమ్మన్నారట?"

"అవును, మాస్టారూ! మన స్కూల్లో కాశీ విశ్వనాథం అనే కుర్రాడు . . ."

"నేను వాడి గురించే మాట్లాడ్డానికి మిమ్మల్ని కలుద్దామనుకున్నాను, మాస్టారూ! ఇప్పుడే చెప్పాడు, మీరు కలవమన్నారని. వాడి జీతం నేను కడతాను, మాస్టారూ! వాడు మూడు నెలలబట్టే జీతం కట్టలేదని నాకు చెప్పలేదు. లేకపోతే ఇలా జరగకుండా నేను చూద్దును."

"వాడు మీ పిల్లలకి ట్యూషను చెబుతున్నా నన్నాడు. . .!"

"ఏం చెయ్యమంటారు, చెప్పండి?" ఊరికే డబ్బు తీసుకోనంటాడు. పేద వాడు. ఏదయినా స్కాలర్‌షిప్ ఇప్పించ మని అప్లికేషన్స్ పెట్టించడమే మిగిలింది.



తాత — మనవడు చిత్రం— డి. వి. సురేందర్ (జగిత్యాల)

కానీ, ఎవరూ వాటిని పట్టించుకుని వాడికి సహాయం చెయ్యలేదు. అందుకే అధమం స్కూలు జీతం నే కడతాను, నా పిల్లలకి ట్యూషను చెప్పరా అన్నాను."

"మాస్టారూ! స్కూలుకి ఇలాంటి వాడు ఒక్కడుంటే చాలండి. సరేలెండి. నేను ఏదో ఒకటి ఏర్పాటు చేస్తాను" అన్నారు అనంతంగారు.

"మీ మేలు జన్మలో మరిచిపోడు వాడు. మరొస్తాను, మాస్టారూ" అంటూ వెళ్ళిపోయాడు రాజు మాస్టారు.

ఆయన వెళ్ళిన వేపే చూస్తూ అలా కూర్చున్నారు అనంతంగారు. ఆయన కిప్పటివరకూ సర్వీసులో ఇలాంటివాడు తటస్థపడలేదు. 'చదువంటే అంత శ్రద్ధ ఉన్నవాడిని ఎలాగయినా అభివృద్ధి లోకి తీసుకురావాలి' అనుకున్నారు మనస్సులో అనంతంగారు.

"ఏమి టలా ఆలోచిస్తున్నారు?" అన్నారు పార్వతమ్మగారు.

"ఏం లేదు, పార్వతీ! ఈ వేళ ఒక సంఘటన జరిగింది. స్కూల్లో ఓ కుర్రాడు మూడు నెలల బట్టీ జీతం కట్టలేదని క్లాసుకి రానియ్యద్దని నోటీసు పంపాను. ఆ కుర్రాడు నా రూము దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. నేను లోపలికి రమ్మనలేదు;వాడూరాలేదు. స్కూలుఅయి పోయిన తరవాత నే నింటికి బయలుదేరే ముందు నన్ను కలిశాడు. తండ్రి లేడట. తల్లి ఊరి చివర హోటల్లో పని చేస్తుం దట. ఆవిడ అస్వస్థత వల్ల కిందటి నెల జీతం లేదట. అన్నిటి కన్నా ఆశ్చర్యం ఆ కుర్రాడు మన తెలుగు మాస్టారి పిల్లలకి ప్రైవేటు చెబుతున్నాడట. 'సార్! నేను ప్రైవేటు చెబుతున్న వాళ్ళ నడిగి ఎంత డబ్బు ఇస్తే అంతా మీకు కట్టేస్తాను . . . నన్ను క్లాసుకి రానీయండి' అన్నాడు ఏడుస్తూ." ఆ మాట అనేసరికి ఆయనకు కూడా కన్నీళ్ళాగలేదు.

"ఏమిటండీ ఆ కన్నీళ్ళు! ?" అన్నారు ఆవిడ ఆశ్చర్యపోతూ.

"ఏం లేదు, పార్వతీ! ఎందుకో వాడి గురించి తలుచుకుంటే. . . మనస్సు. ."

"లేవండి! అలా బాధ పడేకంటే ఆ జీత మేదో మీరే కట్టేయండి" అన్నా రావిడ.

"అవును. . . నేనూ అదే అనుకుంటు న్నాను" అంటూ లేచారు. కాని, ఆయన మనస్సంతా కాశీ గురించి, ఆలోచనల లోనే నిండి పోయిం దా రాత్రంతా.

పొద్దుట స్కూలు కెళ్ళేసరికి తన కంటే ముందుగా నిలబడ్డ కాశీని చూసేసరికి ఆనందంతో తబ్బిబ్బయారు అనంతంగారు.

"నమస్కారం, మాస్టారూ!" అన్నాడు.

"లోపలికి రా, బాబూ" అంటూ పిలిచారు.

"సార్! రాత్రి నేను రాజు మాస్టారు గారితో చెప్పానండి. ఆయన 'ఈ రోజు కట్టేస్తా నా జీతం' అన్నారు. అందుచేత నన్ను క్లాసుకి రానియ్యమని చెప్పండి, మాస్టారూ" అన్నాడు నెమ్మదిగా.

"అక్కడ అవతారంగా ఉన్నారేమో చూడు" అన్నారు పక్కనున్న ప్యూనుతో.

అవతారం ఆ స్కూల్లో హెడ్ క్లార్కు. హెడ్‌మాస్టారు పిలిచారనే సరికి పరుగెట్టుకుంటూ వచ్చాడు. అనంతం గారి ముందు అక్కడ నిలబడ్డ కాశీని చూసి, "ఒరే, కాశీ, ఇలా జీతాలు కట్ట కుండా ఉంటే స్కూలుకి రావడ మెందుకు మానేసి మీ అమ్మకి సహాయంగా ఆ హోటల్లోనే నువ్వూ ఏదో పని చేసుకోకూడదట్రా?" అన్నాడు.

ఆ మాటకి అనంతంగారి మనస్సు చివుక్కుమంది.

"అవతారంగారూ! మిమ్మల్ని పిలిచింది నేను" అన్నారు అనంతంగారు.

"అయ్యా! మీకు తెలియదు గాని, మూడు నెలలకోసారి ఓ నెల జీతం కడుతూంటాడు, సార్, వీడు. స్కూలు మానిపించేయమని వాళ్ళమ్మకి ఎన్నో సార్లు చెప్పాను. ఆవిడ రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదిస్తూంది. . ."

"ఇంకా ఇబ్బందేం ఉండదు వాడికి. ఆ జీతం ఏదో ప్రతి నెలా నేను కడతాను. అందుచేత ప్రతి నెలా నా దగ్గర నుంచి తీసుకోండి" అన్నారు.

కాశీ కంటే అవతారంగారే ఆశ్చర్యంలో మునిగిపోయారు ఆ మాటలకి.

"చూడు, బాబూ! బెల్లయింది. క్లాసుకి వెళ్ళు. నేను రాజు మాస్టారుతో మాట్లాడతాను" అన్నారు.

"నమస్కారం, సార్!" అంటూ పరుగే నడకగా క్లాసుకి వెళ్ళిపోయాడు కాశీ.

"చూడండి, అవతారంగారూ! మనిషి మనస్సు గాయ పరచడం చాలా సులువు. అందులోనూ చిన్న పిల్లల మనస్సులు అద్దాల్లాంటివి. వాటిని జాగ్రత్తగా చూసే బాధ్యత పెద్దవాళ్ళమయిన మనది. 'చదువు మానెయ్యి' అని ఒక్క మాట అనగలిగారే గాని, ఆ పసి హృదయం చదువుకోవాలని ఎంత తాపత్రయపడుతూందో ఆలోచించ లేకపోయారు. . .

నా ఉద్దేశ్యం...

ఏదయినా కానీండి. కానీ, చిన్న పిల్లల తోటి మాట్లాడే విధానం మాత్రం అది కాదు. సర్లెండి. . . దానికేం గాని, ఎంత కట్టాలో నా దగ్గర తీసుకోండి" అంటూ మళ్ళీ కాగితాలు చూసుకోవడంలో నిమగ్న మయ్యారు. అవతారంగారు మాత్రం విప్పిన నోరు మూయకుండానే తన గదిలోకి వచ్చి కూర్చున్నారు.

• • •

"మాస్టారూ!. . . మాస్టారూ!" అంటూ తలుపు కొట్టాడు కాశీ. "ఎవరూ?" అంటూ తలుపు తీశారు పార్వతమ్మగారు.

"ఎవరు కావాలి, బాబూ! ?"


"మాస్టారు లేరా, అమ్మా! !" అన్నాడు ఎంతో వినయంగా కాశీ.

"ఇంకా రాలేదు, బాబూ. అలా కూర్చో" అన్నా రావిడ.

పక్కనున్న బల్ల మీద కూర్చున్నాడు కాశీ.

పార్వతమ్మగారిలో 'అమ్మా' అన్న పిలుపుకి ఏదో అనిర్వచనీయమైన ఆనందం పొంగి పొరలింది. అలా అమాయకంగా కనిపిస్తున్న కాశీ ముఖం లోకే చూస్తూ నిలబడ్డారు.

ఇంతలో అనంతంగారు వచ్చి ఇద్దరినీ చూస్తూ, "మువ్వా, కాశీ?" అన్నారు.




పత్ర చిత్రం    చిత్రం— ఎ. వి. నరసింగరావు (హైదరాబాదు)

"అవును, మాస్టారూ! మిమ్మల్ని కలుద్దామనే వచ్చాను. రాజుమాస్టారు కలవమని చెప్పారు."

"పార్వతీ! నే న్నిన్నను నీకు చెప్పాను కాశీ అని—వాడే వీడు" అన్నారు ఆనందంగా.

"నే నప్పుడే అనుకున్నాను" అంటూ గొడుగూ, తాళాలూ తీసుకున్నారు పార్వతమ్మగారు.

"సార్. . ."

"ఆ. . . ఏం?"

"అది కాదు, సార్. . ."

"నాకు తెలుసురానువ్వుచెప్పబోయేది. పార్వతీ!" అంటూ పిలిచారు మళ్ళీ పడకకుర్చీలో కూర్చుంటూ.

"వాడు డబ్బు ఊరికే తీసుకోడు. అందుచేత రేపటినుంచీ సాయంకాలం వేళ వచ్చి నీకు పాఠాలు నేర్పుతాడు. నేర్చుకో. ఆ జీతం వాడి జీతం కింద కడతాను నేను స్కూల్లో" అన్నారు.

పార్వతమ్మగారు చిన్నగా నవ్వారు.

"నేను వేళాకోళం ఆడ్డం లేదు పార్వతీ. కాశీ! నువ్వు రేపట్నుంచి వచ్చి పాఠాలు మొదలుపెట్టు" అంటూ లోపలికి వెళ్ళిపోయారు.

"రే పొస్తానమ్మా" అంటూ లేచాడు కాశీ.

మళ్ళీ 'అమ్మా' అనే అతని పిలుపులో ఏదో అనుభూతి కలిగిం దావిడకి. అచేతనంగా కాశీ వెళ్ళిన వేపే చూస్తూ నిలబడ్డారు.

"పార్వతీ!" అంటూ అనంతంగారు పిలిచిన పిలుపుకి ఆవిడ పరధ్యానంలో పలక్కపోతేఆశ్చర్యంగా—"ఏమిటి,పార్వతీ, ఆలోచిస్తున్నావు?" అన్నారు ఆయనే తిరిగి.

"అదే— ఆ కాశీ 'అమ్మా' అని పిలిస్తే ఏదో తెలియని ఆనందం కలుగుతూం దండీ" అంటూ లోపలికి వెళ్ళారు. కాని, ఆయన కళ్ళలో కదిలిన కన్నీటిని మాత్రం ఆవిడ గమనించలేదు.

• • •

"మాస్టారూ! నా ఐ. ఎ. ఎస్. రిజల్టు పేపర్లో చూసే ఉంటారు. నేను పదవ తేదీకి వస్తున్నాను. అమ్మగారికి నమస్కారములు తెలియజెయ్యండి.

నమస్కారములతో. . .

మీ విధేయుడు
— కాశీ."

ఉత్తరంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు అనంతం మాస్టారు. అరుగు మీంచే "పార్వతీ!" అంటూ కేక వేశారు చెబుతున్న పాఠం ఆపి.

"ఆఁ..." అంటూ వచ్చిన పార్వతమ్మ గారికి ఉత్తరం ఇచ్చి, "కాశీగాడు వ్రాశాడే" అన్నారు ఆనందంగా.

ఉత్తరాని కావిడ ఉబ్బిపోయి కాలెండరు వేపు చూసి, "రేపే వస్తున్నాడండీ" అన్నారు. మాట చివర ఆవిడ గొంతు జీరపోయింది. ఆ ధ్వనిలోని ఆవేదన అవగతం చేసుకోగలిగారు అనంతంగారు.

"ఆఁ...ఆఁ. . . రేపే వస్తున్నాడు" అన్నా రాయనకూడా.

"ఎవరు, మాస్టారూ, వస్తూంట?" అంటూ రాజుమాస్టారు వచ్చారు. ఆయన వచ్చారంటే చాలు. . . వెళ్ళి పోవచ్చనే సంతోషంతో పిల్లలందరూ వెళ్ళి పోయారు. పార్వతమ్మగారు చదరంగం బల్ల, పావులు తెచ్చి ఇద్దరి మధ్య పెట్టారు.

ఆలోచనల నించి తేరుకున్న అనంతం గారు పావులు పేరుస్తూ, "ఇదేనండీ. మన కాశీ ఐ. ఎ. ఎస్. పరీక్షలో సెలక్ట య్యాడట. రేపు వస్తున్నానని ఉత్తరం వ్రాశాడు" అన్నారు.

"ఇదంతా మీ చలవే, మాస్టారూ!" అన్నారు రాజుగారు.

"కానీ, ఆ చిరుదీపం వెలిగించింది మీరే కదండీ?" అన్నారు అనంతంగారు.

'నిజమే' అని మనస్సులో మాత్రమే అనుకున్న రాజుగారు తృప్తిగా నిట్టూర్చి, "దానికి ఆసరా మాత్రం మీరు కదా ఇచ్చింది" అన్నారు. ఇద్దరి మనస్సు ల్లోనూ కాశీ గురించిన ఆలోచనలు చెదురు మదురుగా రాసాగాయి. ఆటలో పావులు కూడా ఆలోచన మల్లే వాటి ఇష్ట మొచ్చి నట్లు కదలసాగాయి.

"ఈ వేళకి ఇంక, ఆపేద్దాం మాస్టారూ" అంటూ లేచారు రాజుగారు.

"పోనీ, రాజుగారిని ఓ పది రూపాయ లడగ లేకపోయారా?" అంటూ బయటికి వచ్చారు పార్వతమ్మగారు, రాజుగా రెళ్ళిపోయాక. "ఆయన మాత్రం ఎలా సర్దగలరు? ఏదో నేనే చూస్తాన్లే" అంటూ లేచారు అనంతంగారు.

రైలు టైముకి గంట ముందుగానే స్టేషనుకి చేరుకున్నారు అనంతం మాస్టారు. కాని, అది అర్ధ గంట లేటుగా వచ్చింది. తలుపు దగ్గర నిలబడి, "మాస్టారూ, ఇక్కడ" అంటూ రైల్లోంచే పిలిచిన కాశీ కంపార్టుమెంటు వేపు పరుగెట్టారు.

దిగగానే ఆయన కాశీని కౌగిలించుకుని, ఆనందబాష్పాలతో తడిపేశారు. ఇద్దరికీ మాటలు పెగల్లేదు. "అమ్మ ఎలా ఉన్నారు?" అని మాత్రం అనగలిగాడు కాశీ. "బాగానే ఉంది. పద. . . నీ కోసం ఎదురు చూస్తూంటుంది" అంటూ పెట్టె అందుకోబోయారు. "ఆఁ. . . మాస్టారూ!" అంటూ తనే తీసుకుని బయటికి వచ్చి రిక్షా మాట్లాడాడు.

గుమ్మంలో నిలబడ్డ పార్వతమ్మగారి కౌగిట్లో వాలిపోయాడు కాశీ—"అమ్మా" అంటూ.

రిక్షాలోంచి పెట్టె తీసుకుని లోపల పెట్టి, రిక్షావాడికి డబ్బు లిచ్చి పంపేశారు. కండువా కుర్చీ మీద వేసి, "వాడిని కూర్చోనియ్యి, పార్వతీ" అన్నారు అనంతంగారు.

అప్పటికిగాని బాహ్య ప్రపంచంలోకి రాలేకపోయారు కాశీ, పార్వతమ్మగార్లు. ఆ రాగానుబంధాల్ని ఎవరూ ఊహించలేరు అనుకున్నారు అనంతంగారు.


# హృదయంలో యవ్వనం...



## ముఖంలోనే ప్రతిబింబించు

మీలో పొంగారే యవ్వనాన్ని మచ్చలేని, మృదువైన మీ చర్మంపై ప్రతిఫలింపచేయండి...పాండ్ కోల్డ్ క్రీమ్ సహాయంతో. అందమైన రూపం కోసం క్రీమ్ రూపంలో గల సహజమైన నూనెలన్నిటి మిశ్రమంతో ఇది రూపొందించబడంది. మీ చర్మ సంరక్షణ కోసం దీనితో మీ చర్మాన్ని బాగా రుద్దండి...భరించలేని చలిగాలి నుండి మీచర్మాన్ని రక్షించండి.




యవ్వనపు చర్మ సౌందర్యము మీద
# పాండ్స్ కోల్డ్ క్రీమ్

చీస్‌బ్రో–పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (యు.ఎస్.ఎ.లో పరిమిత బాధ్యతతో స్థాపించబడినది)

లింటాస్–CPC.



బ్రతుకు వెలిని
చిత్రం— ఎస్. మురళీధరరావు
(హైదరాబాదు)

వడ్డన చేసి ఇద్దరినీ పిలిచారు పార్వతమ్మగారు. "ఎన్నాళ్ళ తరవాత మీ చేతి భోజనం తింటున్నా నమ్మా!" అన్నాడు కాశీ. అలా మాటల్లో ఎంత కాలం గడిచిపోయిందో ఎవరూ గుర్తించ లేదు. "సాయంకాలం అలా రాజు మాస్టారు ఇంటికి వెళ్ళి వస్తానమ్మా" అన్నాడు కాశీ. అప్పటికే అనంతంగారు ఎక్కడికో వెళ్ళారు.

రాజు మాస్టారి ఇంటి తలుపు దగ్గరగా వేసిఉంది. అనంతంగారి గొంతు, రాజు మాస్టారి గొంతు స్పష్టంగా వినబడు తున్నాయి.

"అలా అనకండి, మాస్టారూ! వాడికి మీ పట్ల, మీ భార్య పట్ల ఉన్న అభిమానం నాకు తెలియదంటారా!. ."

"మీ రెన్ని చెప్పండి, రాజుగారూ! వాడి కిక్కడ సంగతులు ఒక్కటీ తెలియ నీయకండి. . ."

"అది కాదు, మాస్టారూ. . ."

"చూడండి, రాజుగారూ! ఇక మా క్కావలసిం దేముంది, చెప్పండి. . .! పిల్లా! పాపా. . .! ఇంక బతికినన్నాళ్ళూ బ్రతకం కదా! వా కొచ్చే ఆ పెన్షను, ట్యూషన్ల మీద వచ్చే డబ్బూ మా ఇద్దరి పొట్టలూ గడవ్వంటారా?"

"కాని, ఇల్లు. . ."

"దాని బెంగకూడా తీరిపోయింది. నిన్ననే శెట్టిగారితోమాట్లాడాను. ఆయన మేం బ్రతికినన్నాళ్ళూ ఆ పెరటి వేపు రెండు గదులూ ఉపయోగించుకో వచ్చును అన్నాడు. ఇక మా కున్న దిగు లేమిటి? మా పార్వతి చేసుకున్న అదృష్టం . . . దాన్ని నోరారనే కాకుండా మనసారా కూడా 'అమ్మా' అని పిలిచే కొడుకు దొరికాడు. దాని కంటే ముందు నేనే పోవాలనుకుంటున్నా. . . తననే నా కళ్ళ ముందే తీసుకుపొమ్మని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా ప్రతి నిత్యంకూడా."

"మాస్టారూ! మీ ఇద్దరి మనస్సులూ ఇంత నిర్మల మయినవీ, పవిత్ర మయి నవీ కాబట్టే వా డంత అభివృద్ధిలోకి వచ్చాడు మీ నీడలో. . ." అన్నాడు కృతజ్ఞతా భరితమయిన కన్నీటి కళ్ళతో రాజుగారు, అనంతం మాస్టారి రెండు చేతులూ పట్టుకుని.

"అంతేం లేదు, రాజుగారూ! నీకు నీడ లేనినాడు, నీ నీడ మరో ప్రాణికి నీడకల్పిం చును అనేదే నా భావన ఎప్పుడూకూడా... రాజుగారూ! అడగడానికి నోరు రావటం లేదు గాని, ఓ పది రూపాయలుంటే సర్దండి. రేపు కాశీ వెళ్ళాక ఆ ఇంటి సంగతి తేల్చి డబ్బు చేతికి రాగానే, మీ డబ్బంతా మీకు ఇచ్చేస్తాను" అన్నారు లేస్తూ.

"ప్రస్తుతానికి నా దగ్గర ఆరు రూపాయ లున్నాయి. తీసుకెళ్ళండి" అన్నారు రాజుగారు బాధగా.

కాశీ గబుక్కున గుమ్మం దిగి పక్కగా తప్పుకున్నాడు. అనంతం మాస్టారు అటు పక్కగా వెళ్ళిపోయారు.

* * *

"మాస్టారూ!" అన్నాడు కాశీ.

"ఎవరూ?" అంటూ అటు తిరిగిన రాజుమాస్టారు ఆనందంగా, "రా, బాబూ" అంటూ, భుజం మీద చేయి వేసి లోపలికి తీసుకు వెళ్ళారు కాశీని.

"మాస్టారూ! నేను ఐ. ఎ. ఎస్. కి సెలక్టయ్యానండి."

"సంతోషం, బాబూ! అనంతం మాస్టారు చెప్పారు. . ."

"ఇదంతా మీ అందరి ఆశీర్వచన ఫలితం, మాస్టారూ. . ."

"అవకాశాలు వచ్చినా వాటిని ఉపయో గించుకుని అభివృద్ధిలోకి వచ్చే వాళ్ళు ఎంతమం దున్నారు, బాబూ?... అయితే, ఇప్పుడు పోస్టింగ్ ఎక్కడ! ?"

"రాజస్థాన్‌లో వేశారు, మాస్టారూ! అందుకే అమ్మగార్నీ, మాస్టారుగార్నీ తీసుకుని వెళ్ళిపోదామని వచ్చాను."

"ఆయన ఒప్పుకుంటే అంతకంటే కావలసిం దేముంది, బాబూ!"

"ఒప్పుకోవడమేటి, మాస్టారూ! కొడుకింటికి రావడానికి ఒప్పుకోవడం, ఒప్పుకోక పోవడమూనా! అయినా, మాస్టారూ, ఆ రోజుల్లో మీ రిద్దరూ నాకు అవకాశం కల్పించక పోతే ఏ రోడ్డు మీద తిరిగేవాడినో కదండి. . ."

"మాస్టారూ! మీ గురించే తెచ్చాను ఈ శాలువా" అంటూ పాకెట్టు అందిం చాడు.

అంతులేని ఆనందంతో పాకెట్టు విప్పి కప్పుకుని చూసుకుని మరీ మురిసి పోయారు రాజు మాస్టారు.

"మీకు జ్ఞాపకం ఉందా,మాస్టారూ? మీరు క్లాసులో అంటూండే వారు. . . నా శిష్యు డెవరయినా అభివృద్ధి లోకి వచ్చి శాలువా కొని ఇస్తే నేను కప్పుకుని సంతోషిస్తా నా అని. అందుకే ఇది మీకు కొన్నాను, మాస్టారూ, అన్నాడు కాశీ.

"అది నీ కింకా జ్ఞాపకం ఉందిరా, కాశీ!" అంటూ కుర్చీలోంచి లేచి వచ్చి అమాంతం కాశీని కౌగిలించుకున్నారు.

"మరి నే వస్తాను, మాస్టారూ!" అంటూ లేచి ఇంటి వేపు బయలు దేరాడు. మనస్సంతా ఆలోచనలతో నిండి పోయింది. 'అయితే, ప్రతి నెలా అయిదో తేదీకి ఎవరో చేస్తున్న సహాయం పేరిట వచ్చే మనిఆర్డరు. . . పార్వతమ్మగారి ఒంటిమీద నగలు ... అనంతం మాస్టారి కష్టార్జితంతో కొన్న ఆ ఇల్లు కరిగి వచ్చే దన్న మాట.'

కాశీ ఇంటి కెళ్ళాక భోజనాలు పూర్తి చేసుకుని హాల్లో కూర్చున్నప్పు డన్నాడు— "అమ్మా. . . మీ రిద్దరూకూడా ఆదివారం నాతో బయలు దేరా లని.

"మే మెక్కడికి, బాబూ?" అన్నారు పార్వతమ్మగారు ఆశ్చర్యంగా.

"ఎక్కడికా? మనింటికి . . . అమ్మా, ఇక నుంచి నే నెక్కడుంటే అదే మీ ఇల్లు" అన్నాడు.

ఆ మాటకి ఆవిడ ఎంత పొంగి పోయారో ఎవ్వరూ ఊహించలేరు.

"ఏం, మాస్టారూ, మాట్లాడరు మీరు! ?" అన్నాడు.

"ఎందుకురా,కాశీ, ఈ పండుటాకుల ఒంపటం నీకు?" అన్నారు అనంతంగారు.

"పండుటాకులు కాబట్టే శ్రద్ధ తీసుకోవాలి, మాస్టారూ. . . నే చిగు రాకులా ఉన్నప్పుడు మీ ఇద్దరి చేతుల చల్లని నీడంలో వాడిపోకుండా కాపా డారు. ఇప్పుడు ఇది నా ధర్మం కాదన గలరా?"

"అంత మాట అనకురా, కాశీ! ఏదో నాకు చేతనయిన సహాయం చేశాను. అది కూడా ఊరికే చెయ్యలేదు కదరా! మీ అమ్మకి పాఠాలు చెప్పావు కదా! ?"

"మాస్టారూ! మీ సహాయానికి విలువ కడుతున్నారా! అది ఈ ప్రపంచంలో వాళ్ళెవరికి కాదు కదా, ఆ భగవంతునికి కూడా విలువ కట్టడం సాధ్యం కాదు. నాకు తెలుసు—నా చదువుకి, నా భవిష్య త్తుకి అమ్మగారి ఒంటిమీద నగలే కాదు, కనీసం ఉండాలని ఆశించే ఇల్లు కూడా కరిగిపోయిందని తెలుసు. ఈ రక్తం . . . ఈ నాటి ఈ నా ఉన్నత స్థితి. . . మీది. . . ఇదంతా మీ ఇద్దరిదీను, మాస్టారూ! అమ్మ పోయిననాడు ఏం మాటిచ్చారమ్మా మీరు? 'కాశీ. నా కొడు'కన్లేదూ మీరు? ఇంకో మాట నేన దలుచుకోలేదు, వినదలుచుకో లేదు. . . మాస్టారూ! పాపీ, మీ ఋణం తీర్చుకుందుకు అమ్మకి మిగిలిపోయిన పాఠాలేనా చెప్పేస్తాను నా దగ్గ రుంచు కొని. అందుకేనా రండి, మాస్టారూ" అన్నాడు నీళ్ళు నిండిన కళ్ళతో.

ఆ రెండు హృదయాలు కరిగి పోయాయి కాశీ మాటలకి.

మరునాడు ఉదయం కాశీ చెయ్యి పట్టుకొని ప్లాట్ ఫారమ్ మీద రైలెక్క డానికి నడుస్తున్న పార్వతమ్మగారిని "నీలో వృద్ధాప్యపు చిహ్న లొచ్చే శాయే, పార్వతీ" అని అనంతంగారు అంటూంటే నవ్వుతూ, "మీ రిద్దరికీ చెయ్యిఆసరా కావలిసి ఉంటుందనే భగవంతుడు కాశీని నా కొడుకుగా చేశాడు, మాస్టారూ" అన్నారు రాజు మాస్టారు.

రైల్లో కూర్చున్నాక, "మరి వస్తాం, మాస్టారూ" అన్న అనంతం గారి మాట లకి రాజుగారి హృదయంతోబాటు కళ్ళకూడా ద్రవించాయి.

"మాస్టారూ! ఉత్తరాలు వ్రాస్తూం డండి" అన్నాడు కాశీ రాజు మాస్టారికి నమస్కరిస్తూ.

"మేము వెలిగించిన దీపం మాకే వెలుగుని చూపిస్తూంటే అంతకంటే వేరే ఆనంద మేముంటుంది, బాబూ!" అన్న మాటలు రైలు చప్పుడులో కాశీకి వినపడ్డాయో లేదో కాని, రాజు మాస్టారి మనస్సులో మాత్రం తన శిష్యు డంత గొప్పవాడు కాగలిగాడన్న ఆనందాను భూతిలో రైలు చప్పుడే తెలియలేదు. ★